# గురజాడ నీడ

'నోరే కాదు కన్ను కూడా అబద్ధం చెప్పగలదు. నోటి కంటె వేగంగా—ప్రొఫెషనల్‌గా నట్టనడిరోడ్డున హత్య జరగడం చోద్యంగా చూసిన గుంపు లోని ఏ ఒక్కరినైనా ప్రశ్నిస్తే, కళ్ళు రెపరెప లాడించి, అమాయకంగా తల అడ్డంగా తిప్పడం మామూలే. అందుకే—మూసుకున్న నోరు, రిక్కిం చిన చెవులు, కళ్ళకు గంతలు—న్యా యదేవత విగ్రహానికి నోరు తెరవదు, కళ్ళతో చూడదు, అడ్డమైన వాగు డంతావాగినా వినడానికి నే రెడీ—అన్నట్లుంటుంది. మంచి కాల క్షేపం న్యాయదేవతకి. వినేవాడికి చెప్పే వాడు లోకువ. చెప్పేవాడికి వినటమే వృత్తిగా పెట్టుకున్న న్యాయదేవతన్నా లోకువే.

◐ ◐ ◐


"అప్పుడు నేను బ్యాచిలర్‌ని. విజయవాడకి ట్రాన్స్ఫరయి నెలరోజులయింది. గవర్నర్‌పేటలో రూమ్ అద్దెకు తీసుకుని ఉంటున్నా."

ద్వారకానాథ్ చెప్తూ నా వైపు చూశాడు. నేను ఉత్సుకతతో వింటున్నానా లేదా అని. నేను 'చెప్ప' అన్నట్లు సైగచేశాను.

నేను మూగవాడిని కాదు. జీవితంలో బాగా విసుగు చెంది వున్నవాడిని మాట్లాడటం, వినటం - వినటం, మాట్లాడటం అనే 'అతి' సాధారణ మనుష్య చర్యల పట్ల నాకు తెలీకుండానే విరక్తి పెంచుకున్నవాణ్ణి. అందుకే ఏ గొడవా లేకుండా పాన్‌మసాలా నోటికి దట్టించి వుంటాను ఎప్పుడూ. న్యాయదేవత పాలసీ. రోజు గడిచిపోయాక ఇంక మనుష్యులెవరూ నా జోలికి రారని నిశ్చయం చేసు కున్నాక, ఆ రోజుకి చివరి పాన్‌మసాలా ఉమ్మేసి, నిశ్చింతంగా పడుకుంటాను.

"నే చెప్పేది అంత తేలిగ్గా తీసుకోకు". ద్వారకానాథ్ అనుమానంతో హెచ్చరించాడు. నేను చేష్టలతో భరోసా ఇచ్చాను ప్రొసీడ్ అవమని.


"జైహింద్ టాకీస్ దగ్గర ఓ గుడ్డి బిచ్చగా డుండేవాడు. ఒకసారి అటేపు వెళ్ళినప్పుడు చూశా.




మనసు లేని గుడ్డితనం
వెనుక
మనసున్న చూపు చెప్పే
ఆత్మీయతా దృశ్యం

# దృష్టి

ప్రసన్నకుమార్ సర్రాజు



కథానిక

ముందర ఓ గుడ్డ పరచి డాల్డా డబ్బా మీద దరువు చేస్తూ ఘంటసాల పాటలు బాగా పాడేవాడు."

"దరువు' ఏమిటి మోటుగా! 'తాళం వేస్తూ' అనొచ్చుగా" అందామనుకున్నాను. నోట్లో పాన్‌మసాలా నా నోరు కట్టిపడేసింది.

వాడి పాటలు అందరికీ నచ్చేవో లేవో కానీ, నాకు మాత్రం చాలా బాగుండేవి. శివశంకరీ... ఇంకా... భూకైలాస్‌లో పాట ఏమిటీ?... అదీ..."

–ఎంత గుడ్డి బిచ్చగాడైతే మాత్రం 'వాడు' అనే సంబోధన నాకు నచ్చలేదు. 'వారు' అనకపోయినా కనీసం 'అతను' అనొచ్చుగా?

"ఆ... దేవదేవ... శంకర... ఎంత బాగా పాడేవాడో! మ్యాట్నీ ఆట వదిలేదాకా అక్కడే వుండి, తడుముకుంటూ కలెక్షన్ చూసుకుని, గోనెపట్టా మడిచి భుజాన వేసుకుని, డాల్డా డబ్బా చంకనేసుకుని, మువ్వలు కట్ట వున్న కర్రని తాటించుకుంటూ వాహనాలనీ, అడ్డంకులనీ తప్పించుకుంటూ, గాంధీనగర్ న్యూ ఇండియా సెంటర్ దగ్గర మళ్ళీ పట్టాపరిచి కచేరీ మొదలెట్టేవాడు.

–ద్వారకానాథ్ చెప్పిన పై పేరాలో 'కలెక్షన్ చూసుకుని' అనే మాట గమ్మత్తుగా తోచి, చిన్నగా నవ్వాను. ఈ మధ్య ఎక్కడ చూసినా ఫలానా బెనిఫిట్ పండు, ఇంకో ఫలానా బెనిఫిట్ ఫండు అంటూ బోర్డులు చూస్తున్నా. బెనిఫిట్ ఎవరికో నాకర్థం కాదు. డబ్బులు జమచేసేవారికా? స్వీకరించేవాళ్ళకా? .

"ఎందుకు నవ్వుతున్నావ్? నే చెప్పేది నిజమే" కొంచెం ఉక్రోషంగా అన్నాడు ద్వారకానాథ్.

నేను మళ్ళీ ప్రొసీడ్ అన్నట్లు సైగ చేశాను. ఇక అతనికి అడ్డు రాదల్చుకోలేదు.

"నేను రోజూ సాయంత్రం 7 గంటలకు న్యూ ఇండియా సెంటర్‌కి చేరేవాణ్ణి. అక్కడ వరసగా ఓ బేకరీ, పాతపుస్తకాలు అద్దెకిచ్చే ఓ అరడజను షాపులు, ఒకటి రెండు టీస్టాల్సూ ఉండేవి. ఓ పుస్తకాల షాపు దగ్గర నిల్చుని, టీస్టాల్లో టీ తెప్పించుకుని తాగుతూ, పుస్తకాలు తిరగేస్తూ ఉండటం నా రోజువారీ కాలక్షేపం. అయినా ఒక చెవితో 'వాడి' పాటలు వింటూ ఆనందించేవాణ్ణి. అదే సెంటర్‌కు ఆ సమయానికి చాలామంది వచ్చేవారు. పనివున్నవాళ్ళూ, పాటలేనివాళ్ళూ, పనీ పాటా కూడా లేనివాళ్ళూ, కాలేజీ కుర్రాళ్ళూ, ముఖ్యంగా ఎమెచ్యూర్ నాటక కళాకారులూ. వీళ్ళు ఓ టిక్కెట్ల బుక్ తీసుకు వస్తుంటారు సెంటర్‌కి. ఐదు రూపాయలు పది రూపాయలు టిక్కెట్టు కొనేదాకా వదిలేవారుకాదు. హనుమంతరాయ గ్రంథాలయంలో వాళ్ళేసే నాటకాన్ని తప్పక చూడాలట.

"సరే – ఇక అక్కడ చేరిన గుంపుకి రోజూ ఏదో ఒక కాలక్షేపం. రాజకీయాలూ, సినిమాలూ అయిపోయాక. టాపిక్ ఆ గుడ్డి బిచ్చగాడిమీదకి

మళ్ళేది. అసలు వాడు నిజంగా గుడ్డివాడా కాదా అనేదే ఆ టాపిక్. ఒకళ్ళిద్దరు 'హాడి'ని గత ఇరవై ఏళ్ళుగా చూస్తున్నామనీ, రోజూ ఇదే టైముకి కర్ర తాటించుకుంటూ వచ్చి కూర్చుని ఓ రెండు గంటలు పాడి, తర్వాత షాపు షాపుకీ వచ్చి అడుక్కోవటం మామూలే" అని చెప్పారు. కొంతమంది "కాదు. వాడు నటిస్తు న్నాడు" అంటారు. ఒక ఔత్సాహిక "బల్లగుద్ది చెప్పి చేతులు వాచిపోయినవాడు" అదేంకాదు. ఒక సారి షాపుల్లో అడుక్కుంటూ ఇదిగో... ఇక్కడే... నేను నిల్చున్న చోటకే వచ్చాడు. (నేననుకున్నాను. బహుశా వాడు నిల్చున్న జాగా, వాస్తురీత్యా మంచి దని ఎవరో చెప్పి వుంటారు. వాడు ప్రక్కరూంలో క్యారమ్‌బోర్డు పందాలువేసి ఆడుతుంటాట్ట ఇరవై నాలుగు గంటలూ – ద్వారకానాథ్ తర్వాత చెప్పాడు ఈ విషయం). ఈ విషయం ఏమిటో తేల్చేద్దామని, వాడి డబ్బాలో పావలావేసి రూపాయి తీసుకున్నా. హహహ్హ... వాడేమీ అనలేదు. బహుశా రూపాయి వేసి పావలా తీసుకున్నాననుకున్నాడేమో! తర్వాత ఓ పది రూపాయల నోటు తీసి వాడి కళ్ళముందు ఆడించా. వాడి కళ్ళు మెరిసినట్లే అనిపించింది" అని ప్రక్కకి తిరిగి 'ఏరా?' అన్నాడు. వాడికి వత్తాసు పలికేవాళ్ళు అవునవునన్నారు. "కాసేపు వాడి కళ్ళముందు ఆడించి పది రూపాయల నోటు వాడి డబ్బాకి ఓ ప్రకకన జారవిడిచా. చటుక్కున వాడు కదిలాడు. కరక్టుగా నోటు వాడి డబ్బాలో పడింది. వాడు పక్క షాపుకెళ్ళిపోయాడు. అంటే దీనర్థం ఏమిట్రా?" అని వెకిలిగా నవ్వాడు.

వాడలా మాట్లాడుతూంటే నాకు అసహ్యమే సింది. వాడి మెళ్ళో గొలుసూ, వేళ్ళకి ఉంగరాలూ–

మొత్తానికి అక్కడ చేరే గ్యాంగులో ఆ బిచ్చగాడి గురించి భిన్నాభిప్రాయాలున్నై.

ద్వారకానాథ్ సిగరెట్ వెలిగించాడు. "ఆరోజు నేనింకా మర్చిపోలేను. ఆరోజు సాయంత్రం అంతా యధాతథం. బిచ్చగాడు పాడుతుండటం, అడ్డమై నవాళ్ళ అడ్డదిడ్డమైన కామెంట్లూ..."

"ఆరోజు క్రిస్‌మస్. సెంటర్ కళకళ లాడు తోంది. రోడ్డుకి అవతలవైపు ఓ చిన్నపిల్ల వాళ్ళమ్మ చెయ్యి విదిలించుకుంటూ మారం చేస్తోంది. చెయ్యెత్తి బేకరీ వైపు చూపిస్తోంది. వాళ్ళ నాన్న వాళ్ళని అక్కడ ఉండమని రోడ్డు క్రాస్‌చేసి కేక్స్ కొనటానికి బేకరీలోకి వెళ్ళాడు. పాప తనని కూడా డాడీ దగ్గరకి తీసుకెళ్ళమని గొడవ చేస్తోంది. వాళ్ళమ్మ వదలటం లేదు. అన్నట్లు, బెజవాడ సిటీ బస్సుల గురించి నీకు తెలుసుగా! జనాలు రోడ్లమీద నడిస్తే అవి పేవ్‌మెంట్ల మీద పోతుం టాయి. మూడో నెంబరు బస్సనుకుంటా పెట్రోల్ బంక్ నుంచి షార్పుగా రైట్‌కి కట్‌చేసి శరవేగంతో వస్తోంది. అది రోజూ చూసే సీనే. బస్సు మేమున్న చోటికి వచ్చి లెఫ్ట్ కట్ చేసి పోవాలి.

'బేబీ' అని పెద్ద కేక. అంతా తల తిప్పి చూశారు. ఆ పాప వాళ్ళమ్మ చేతులు విదిల్చుకుని రోడ్డుకి అడ్డంగా పరుగెత్తుతూ బేకరీ వైపు వస్తోంది – డాడీ – అని పిలుస్తూ.

బస్సు డ్రైవరు కండక్టర్‌తో పిచ్చాపాటీ మాట్లా డుతూ సడెన్‌గా చూశాడు. పాప రోడ్డుకి అడ్డంగా పరుగెత్తుతోంది. బస్సు 60 మైళ్ళ స్పీడుతో వస్తోంది. డ్రైవరు బ్రేక్ నొక్కాడు. చెవులు బద్దలయేలా కీచు మని సౌండు. పాప అప్పటికి బస్సుకి రెండు గజాల దూరంలో వుంది. బ్రేకు అప్లై చేసినా, ఆ స్పీడుకి బస్సు ఆగలా. ఆ మూమెంటమ్ కనీసం ఇరవై గజాలయినా లాక్కెడుతుంది. ఎటు కట్ చేయ్యాలో అర్థంకాక డ్రైవర్ కళ్ళు మూసుకుని స్టీరింగ్ వదిలేశాడు.

ఒక సెకండు, సెంటర్ మొత్తం పిన్‌డ్రాప్ సైలెన్స్. బస్సు టైర్ల రొద తప్ప. అంతా నిశ్చేష్టులై 'చూస్తున్నారు'...

అంతలోనే ఓ చప్పుడు డబ్బా కింద పని చప్పుడు. ఆ బిచ్చగాడు... ఆ 'గుడ్డి' బిచ్చగాడు – కన్ను మూసి తెరిచేంతలో – లేచి పరుగెత్తటానికి కూడా వ్యవధి లేక ఉండలాగా దొర్లుకుంటూ బస్సుకి అడ్డంగా వెళ్ళి పాపని అదుముకుని ప్రక్కకి దొర్లాడు. బస్సు వెళ్ళి లేపాక్షి దగ్గర ఆగింది.

అంతా గందరగోళం. అరువులు.. పాప తల్లీ తండ్రీ వచ్చి పాపని హత్తుకున్నారు ఏడుస్తూ. పాప సురక్షితం. అంతా వాళ్ళని చివాట్లు పెడు తున్నారు. "కళ్ళు లేవూ! పాపని అలా వదిలేసి చూస్తూ ఊరుకున్నారా!" ఇలాగ.

ఈ గొడవలో నేను బిచ్చగాడి కోసం వెతికాను. ఎక్కడా కనిపించలా. ద్వారకానాథ్ చెప్పటం ఆపాడు. నేను బ్లాంక్‌గా చూస్తున్నాను. ద్వార కానాథ్ ఇంకో సిగరెట్ వెలిగించి, కొనమెరుపు చెప్పనా? అన్నాడు. నేను అసంకల్పితంగా తల ఊపాను.

"మర్నాడు అదే టైమ్‌కి అలాగే కర్ర తాటించు కుంటూ తడుముకుంటూ వచ్చి పట్టా పరిచి కూర్చు న్నాడు. పాటకచేరీ అయిపోయాక అలాగే తడు ముకుంటూ వచ్చి అడుక్కుంటూంటే అందరూ... అందరూ మాటా పలుకూ లేకుండా తోచనంత ధర్మం చేశారు. మళ్ళీ కర్ర తాటించుకుంటూ కూల్‌గా – చాలా కూల్‌గా వెళ్ళిపోయాడు. నేను లేచి, పాన్ ఉమ్మేసి వచ్చి, మొదటిసారిగా నోరు విప్పాను.

"There are Many political stars, and cinema stars. BUT HE IS THE STAR OF ALL STARS."

●

13 ఏళ్ళ నాడు తుపాకీ పట్టుకుని అడవుల్లోకి పారిపోయిన

వీరప్పన్



రియల్ సెన్సేషనల్ స్టోరీ అవినాష్ నరసింహన్ కధనంతో వచ్చేవారమే.